క్లుప్తంగా

20 లోగా దరఖాస్తు చేసుకోవాలి

హనుమంతునిపాడు: పండల తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులు 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. ఉపాధి సిబ్బందితో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నీటి వసతి ఉండి 5 ఎకరాల లోపు ఉన్న రైతులు పథకానికి అర్హులన్నారు. జామ, నిమ్మ,దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, మామిడి, సపోటా, మల్లె పూల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 12 మంది రైతులు 41 ఎకరాల్లో సాగుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, టీఏలు, ఎఫ్ఏలు సీసీలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

కనిగిరి రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ అనే అంశంపై స్థానిక ఆల్ఫా విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన, మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా ఓటుహక్కు వినియోగించుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆల్ఫా విద్యా సంస్థల అధినేత జి.మాలకొండారెడ్డి మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటు గొప్పతనాన్ని, విలువ గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ వీఎస్ ప్రసాద్, ఏ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.25 వేల ఆర్థికసాయం

కనిగిరి రూరల్: అనారోగ్యంతో ఆర్థికంగా వైద్యానికి తీవ్ర ఇబ్బంది పడుతున్న జి.లక్ష్మీ కుమారికి ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు, మానవతా సంస్థ అధ్యక్షుడు గుత్తి శ్రీధర్ రూ.25 వేల ఆర్థిక సాయం చేశాడు. డాక్టర్ సుబ్బారెడ్డి, మానవతా సంస్థ సభ్యుల చేతుల మీదుగా బాధితులకు శనివారం అందచేశారు. కమిటీ సభ్యులు పసుపులేటి అరుణోధర్, ఉమాకాంత్, వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఆర్ఎంపీ వైద్యులు చెంచులు, పచ్చవ శేఖర్ పాల్గొన్నారు.

వైవీ చినపోలిరెడ్డి చిరస్మరణీయుడు



కేక్ కట్‌చేస్తున్న బుజ్జి బ్రదర్స్

సీఎస్‌పురం(పీసీపల్లి): టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తండ్రి చిన పోలిరెడ్డి చిరస్మరణీయులు సర్పంచ్ బుజ్జి బ్రదర్స్ అన్నారు. మండల పరిధిలోని కోవిలంపాడు వైవీ చినపోలిరెడ్డి జయంతి కార్యక్రమం శనివారం సర్పంచ్ బుజ్జి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చినపోలిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ, అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, రక్తదానం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మేకల బాలు, మండల పార్టీ అధ్యక్షుడు భూవనగిరి వెంకటయ్య, మిరియం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు మితికెల గురవయ్య, సర్పంచ్‌లు చిరంజీవి, ఆంటోని, ఎంఈఓ డాక్టర్‌మురళీ, రాజశేఖర, బలభద్ర, ప్రభాకర్ ఖాశింపీరా, ఖాదర్‌బాషా, ఉపసర్పంచ్ బాబూరావు, మునగాల నారాయణరెడ్డి, గోను చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల దూరం

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ఐదవ వార్డులో శనివారం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పర్యటించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించి, వార్డులోని తక్షణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ దేవరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు మాల కొండయ్య, రాజారావు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాభ్యాసన సామగ్రి పంపిణీ

పామూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రోత్సాహకంగా స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు విద్యాభ్యాసన సామగ్రి సమకూర్చడం అభినందనీయమని సీఐ కాటూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నిమ్మచెట్లపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్‌ఎం మచ్చా రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జై జపాలి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.32 వేలతో సమకూర్చిన పలకలు, నోట్స్‌లు, పెన్నులు ఇతర విద్యాభ్యాసన సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం కేవీ క్రిష్ణారావు, దరిశి మస్తాన్‌రావు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

కనిగిరి రూరల్: విద్యార్థుల మధ్య మంచి సంబంధాలు, సంకల్పం ఉండాలని హెచ్‌ఎం సిస్టర్ పెరియా నాయగా మేరి అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్ స్కూల్‌లో శనివారం నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్ నాయకుడు అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించండి

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సింగరాయకొండ: విద్యార్థులు ఒక విజన్‌తో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.65 లక్షలతో నిర్మించిన ఆడిటోరియం ప్రారంభోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు 300 మంది ఇంత పెద్ద ఆడిటోరియంను నిర్మించడం గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ తరహాలో పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, యూనిఫాం అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవటానికి అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థులను భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావని అడగ్గా.. ఒక్కొక్కరు టీచర్, ఎస్సై కావాలని అనుకుంటున్నామని చెప్పగా..దీనికి కలెక్టర్ స్పందిస్తూ మన లక్ష్యం చిన్నదిగా ఉండకూడదని, భారీగా ఉండాలని ఐఏఎస్, ఐపీఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కలెక్టర్ పైలాన్‌ను ఆవిష్కరించి ఆడిటోరియాన్ని ప్రారంభించగా..స్టేజీని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్, టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ వాకా శ్రీనివాసులరెడ్డి, ఎస్ఆర్ఐ బుర్రా కోటిరెడ్డి, డాక్టర్ హరిబాబు, సర్పంచ్ బల్లెల ప్రభాకర రెడ్డి, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి , ఏపూరి శ్రీనివాసులు, కొండూరి అంకయ్య, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, తహసీల్దార్ సీహెచ్ ఉష, లాయర్లు బక్కముంతల వెంకటేశ్వర్లు, కొల్లూరి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 10 కుటుంబాలు



:ముప్పాళ్లలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

పొన్నలూరు: పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల ఎస్సీ కాలనీకి చెందిన 10 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చేవూరి పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో శనివారం వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై నమ్మకంతోనే టీడీపీ నుంచి స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. పార్టీలో చేరిన వారిలో మద్దాళి వెంకమ్మ, నాగయ్య, సింగయ్య, మణెమ్మ, కొంకిముడుసు తిరుపాలు, రవి, వరమ్మ, రావినూతల గోపితో పాటు మరి కొన్ని కుటుంబాలు వారు ఉన్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, గుండాల రామకోటిరెడ్డి, అంకిరెడ్డి, కూనం సుందరరామిరెడ్డి, వాసుపల్లి మహేంద్రరెడ్డి, పత్తిపాటి మాధవ, హనుమంతురావు, ఉలపాటి మాల్యాద్రి, మెండా శ్రీరాములు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



చింతలపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వంలో వరికూటి

జరుగుమల్లి(సింగరాయకొండ): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తన కర్తవ్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. జరుగుమల్లి మండలం చింతలపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వంలో వరికూటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఎవరి కన్నా పథకాలు రాకుండా ఉంటే వారికి అందించేందుకు మీ ముందుకు వస్తున్నామన్నారు. నియోజకవర్గంలో లక్ష గడపలకు పైగా తిరిగానని తాను ఎల్లప్పుడు ప్రజల్లో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికే కృషి చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యే స్వామి లాగా తానెప్పుడూ ఏసీ గదులకు పరిమితం కాలేదని, నిత్యం ప్రజల్లోనే ఉంటున్నానన్నారు. పేదల మరుగుదొడ్ల బిల్లులు స్వాహా చేసిన ఘనుడు ఎమ్మెల్యే స్వామి అని ధ్వజమెత్తారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు గ్రామ వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడుతున్నారని, వాస్తవానికి వృద్ధులు, వికలాంగులకు ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తున్నారన్నారు. తరువాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బెల్లం నిర్మల, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ బెల్లం సత్యన్నారాయణ, ఒంగోలు నగర మహిళా అధ్యక్షురాలు పల్లా అనూరాధ, సర్పంచ్ వేల్పుల హరిబాబు, ఎంపీటీసీ మల్లీశ్వరి, బద్దిపూడి సురేష్, కసుకుర్తి అశోక్, మహేష్, వెంకటేశ్వర్లు, బద్రీ, నల్లూరి సురేంద్ర, ఎంపీడీఓ జలజాక్షి, పంచాయతీరాజ్ ఏఈ కోట శ్రీహరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబాన్ని సమగ్రంగా సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ నారదముని

కొండపి: బూత్‌లెవల్ అధికారులు ఓటర్ జాబితాలు తీసుకుని క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తిరిగి ప్రతి కుటుంబాన్ని సమగ్ర సర్వే చేయాలని విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఈఆర్‌ఓ బి.నారదముని తెలిపారు. స్థానిక కామేపల్లి రోడ్డులోని ప్రైవేట్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన కొండపి నియోజకవర్గం స్థాయి బూత్‌లెవల్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి బూత్‌లెవల్ అధికారి కచ్చితంగా ఓటరు లిస్టులు తీసుకుని ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలని సూచించారు. సర్వే చేసే కుటుంబంలో ఓటర్లు ఎంతమంది ఇప్పుడు ఎంతమంది ఉన్నారు, ఎవరైనా మృతి చెందారా అన్న వివరాలు నమోదు చేయాలన్నారు. కొత్తగా 18 ఏళ్ల నిండిన వారు ఉంటే ఓటు కోసం నమోదు చేయించాలన్నారు. పేర్లు తప్పులు, డోర్‌నంబరు తప్పులు ఉంటే సవరణ ఫారాల్లో నమోదు చేయాలన్నారు. ప్రతిది క్షుణ్ణంగా నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఓటరు జాబితాను పెట్టుకొని బీఎల్‌ఓలు సర్వే చేయాలన్నారు. మర్రిపూడి తహసీల్దార్ క్రిష్ణారావు, పొన్నలూరు తహసీల్దార్ శ్రావణ్ కుమార్, సింగరాయకొండ తహసీల్దార్ ఉష, టంగుటూరు తహసీల్దార్ సంజీవ రావు, జరుగుమల్లి తహసీల్దార్ ఉష, కొండపి ఈడీటీ నాగరాజు, డీటీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త గైర్హాజరుపై జెడ్పీటీసీ ఆగ్రహం



ఇమ్మడిచెరువు అంగన్‌వాడీని పరిశీలించిన జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి

వెలిగండ్ల: మండలంలోని ఇమ్మడిచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్త షేక్ షరీఫా గైర్హాజరైంది. ఉదయం 9:40 గంటల వరకు కేంద్రం తలుపులు తీయలేదు. కార్యకర్త బంధువు 9:45 గంటలకు వచ్చి తలుపులు తీసింది. ఆ రోజు పిల్లలకు చేయాల్సిన వంటకు కూరగాయలు ఇచ్చి వెళ్లింది. ఆ కేంద్రంలో 8 మంది పిల్లలు రికార్డులో నమోదై ఉన్నారు. గత వారం నుంచి కార్యకర్త షేక్ షరీఫా సెలవు పెట్టకుండా గైర్హాజరు కావడంపై జెడ్పీటీసీ మండిపడ్డారు. పిల్లల హాజరు రిజిస్టర్ తప్ప కార్యకర్త, ఆయా హాజరు రిజిస్టర్లు అంగన్‌వాడీ కేంద్రంలో లేకపోవడం ఏంటని ఆయా ధనమ్మను ప్రశ్నించారు. వారం రోజుల నుంచి కార్యకర్త కేంద్రానికి రాలేదని సూపర్‌వైజర్ కృపావరంకు ఫోన్ చేసి అడిగారు. రెండు రోజులు పర్మిషన్ తీసుకున్నారని, శనివారం విధులకు వస్తున్నట్లు చెప్పినట్లు సూపర్‌వైజర్ సమాధానమిచ్చింది. దీంతో కార్యకర్తపై విచారించి చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీకి జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి ఫిర్యాదు చేశారు.

లోకేష్ పాదయాత్రను పట్టించుకునేదెవరు..?

- మరుగుదొడ్ల అవినీతి సొమ్ముతో పాదయాత్రకు ఎమ్మెల్యే స్వామి ఏర్పాట్లు
- పాదయాత్రకు స్పందన లేకపోవడంతో పక్క నియోజకవర్గాల నుంచి జన సమీకరణ
- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు

పొన్నలూరు: టీడీపీ నాయకుడు నారా లోకేష్‌బాబు చేసే పాదయాత్రకు విలువ లేదని, పాదయాత్రను ప్రజలు పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. పొన్నలూరులో విలేకరుల సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో మరుగుదొడ్ల అవినీతి సొమ్ముతో టీడీపీ ఎమ్మెల్యే స్వామి, షాడో ఎమ్మెల్యే దామచర్ల సత్య లోకేష్ పాదయాత్రకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు అన్ని విధాలా సంతోషంగా ఉన్నారన్నారు. అందుకనే లోకేష్ పాదయాత్రకు నియోజకవర్గంలో పెద్దగా స్పందన రావడం లేదన్నారు. నాలుగు రోజులుగా ఎమ్మెల్యే జన సమీకరణ కోసం గ్రామాల్లో తిరుగుతున్నా టీడీపీ కార్యకర్తలు సైతం పట్టించుకోవడంతో పక్క నియోజకవర్గాలు, జిల్లాల నుంచి జన సమీకరణ చేస్తున్నారన్నారు. పాదయాత్రలో అల్లర్లు, గొడవలు సృష్టించి సానుభూతి కోసం ఆ నిందను వైఎస్సార్ సీపీ నాయకులపై నెట్టాలని చూస్తున్నారన్నారు. లోకేష్ పాదయాత్రకు వచ్చే అవకాశం లేకపోవడంతో ఒక్కొక్కరికి రూ.1000 ఇచ్చి తరలిస్తున్నారని ఎద్దేవా చేశారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, చేవూరి పద్మనాభరెడ్డి, మెండా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్- 3 విజయోత్సవం

కనిగిరి రూరల్: శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు అద్భుతమైన తెలివితేటలు, నైపుణ్యత ప్రదర్శించి చంద్రయాన్- 3 విజయవతం చేసినందుకు స్థానిక ఏఎల్ ఎంఎస్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం విజయోత్సవం చేశారు. జయహో భారత్, జయహో చంద్రయాన్- 3, రియల్ హీరోస్ ఇస్రో శాస్త్రవేత్తలకు సెల్యూట్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, గుడ్ హెల్ప్, వివిధ సంస్థల ప్రతినిధులు రమేష్, కిరణ్ కుమార్, నవకుమార్, రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ రామిరెడ్డి మృతి

వెలిగండ్ల: పి.నాగులవరం మాజీ సర్పంచ్ కీసరి రామిరెడ్డి శనివారం తన స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. వైఎస్సార్‌సీపీ లో చురుకైన నాయకుడిగా పనిచేశాడు. రామిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని పలువురు సంతాపం తెలిపారు. జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, వై నాగూర్ యాదవ్, టి.దేవసహాయం, దమ్ము చెన్న కేశవ, జేసీఎస్ కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

ఇదేం నీచ రాజకీయం

- టీడీపీ వాళ్లకే తిరిగి కండువాలు కప్పి
- వైఎస్సార్ సీపీ వాళ్లు చేరారంటూ గోబెల్స్ ప్రచారామా..?
- లోకేష్ మెప్పు కోసమే ఉగ్ర జిమ్మిక్కులు
- విలేకరుల సమావేశంలో పీసీపల్లి వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



మాట్లాడుతున్న పీసీపల్లి వైఎస్సార్ సీపీ నేతలు

కనిగిరి రూరల్: టీడీపీ వాళ్లకే కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ వాళ్లు టీడీపీలో చేరారంటూ గ్లోబల్ ప్రచారం చేస్తున్నారు ఇదేం సిగ్గు మాలిన రాజకీయం అంటూ పీసీపల్లి ఎంపీపీ అత్యాల జఫన్య, పార్టీ మండల అధ్యక్షుడు గోపవరపు బొర్రారెడ్డి, ఓకేరెడ్డిలు మాజీ ఎమ్మెల్యే, టీటీడీ నేత ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిపై తీవ్రంగా ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పీసీపల్లి మండలం వరిమడుగులో జంపాని రమణారెడ్డి, మొతుకూరి నరసింహం , ఎం వెంకట కృష్ణలతో పాటు మరి కొందర్ని టీడీపీ నేత ఉగ్ర కండువాలో కప్పి.. వైఎస్సార్ సీపీ వారు పార్టీలో చేరారని దుష్ప్రచారం చేస్తూ జిమ్మిక్కు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఉగ్ర నరసింహారెడ్డి కండువా కప్పిన జంపాని రమణారెడ్డి 2020 ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ పార్టీ తరఫున బీ ఫాం తీసుకుని నామినేషన్ వేశారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో జంపాని రమణారెడ్డికి డిపాజిట్లు రాలేదని ఘాటుగా విమర్శించారు. ఉగ్ర నరసింహారెడ్డి కండువా కప్పి నాయకులెవరు వైఎస్సార్‌సీపీలో ఎప్పుడూ లేరని వివరించారు. కేవలం టీడీపీ నేత లోకేష్ వద్ద మెప్పు పొందేందుకే మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి జిమ్మిక్కుల రాజకీయం చేస్తున్నాడని ఘాటుగా విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఉగ్ర నరసింహారెడ్డిని ప్రజలు మరోసారి చిత్తు చిత్తుగా ఓడిస్తారన్నారు. పీసీపల్లి మండలంలో వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ వస్తోందన్నారు. వరిమడుగు సర్పంచ్ మెతకూరి నరేంద్ర చౌదరి, జంపాని ఎర్ర రమణారెడ్డి, చెరుకూరి సతీష్ చౌదరి, వేణు, తిరుపతయ్య, యేరువ నర్సింహ చౌదరి, భూమిరెడ్డి కొండారెడ్డి, నాగేశ్వరరావు, మేకల మాల్యాద్రి, సుదర్శనం, మాజీ ఎంపీపీ బత్తుల అంజయ్య, సర్పంచ్ మూలే రాజశేఖర రెడ్డి, సర్పంచ్‌లు మాలకొండయ్య, శ్రీను, కసిరెడ్డి ఓబులరెడ్డి, పరిమి వెంకట్రావ్, పులి రవి, ఉండేలా వెంగళరెడ్డి, బలసాని మోహన్, ఇతర నేతలు పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరులకే కండువాలు కప్పి..



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి

హనుమంతునిపాడు: టీడీపీ సానుభూతిపరులకే కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీలో చేరారని ప్రచారం చేసుకోవడం మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి తగదని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వి.గురుప్రసాద్, మండల యూత్ అధ్యక్షుడు భవనం కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కొదమల బెంజీలు ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 13న దొడ్డిచింతలలో టీడీపీ చేరిన వారంతా ఎప్పటి నుంచో ఆ పార్టీలో ఉన్నవారేనన్నారు. సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, కోటపాటి రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగూర్‌లు టీడీపీ నాయకులు. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీలోనే వారంతా ఉన్నారని, కేవలం ప్రజలను మభ్య పెట్టేందుకు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్నారు తప్ప వారిని ఎమ్మెల్యే గానీ, మండల నాయకులు గానీ పార్టీలోకి ఆహ్వానించలేదన్నారు. గ్రామంలో 180 కుటుంబాల్లో 40 కుటుంబాలు వలస వెళ్లాయన్నారు. మిగిలిన 140 కుటుంబాల్లో 110 కుటుంబాలు వైఎస్సార్ సీపీ నాయకుడు కోటపాటి మోహన్‌రెడ్డి వైపున ఉన్నారని, మిగిలిన 30 కుటుంబాలు టీడీపీ వారేనన్నారు. వైఎస్సార్ సీపీకి రోజు రోజుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే టీడీపీ చేరారంటూ మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, సర్పంచ్ బ్రహ్మారెడ్డిలు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సచివాలయ మండల కన్వీనర్ ఎం.తిరుపతయ్య, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కత్తిరాజారావు, గాలం రామక్రిష్ణ, మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షులు జి .ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీ రుద్రపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1వఅంతస్తు,
భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీతలు: (1). మెస్సర్స్. శ్రీ సాయి గణేష్ గ్రానైట్స్, డి.నెం. 73, ... గ్రామం, ... మండలం, ప్రకాశం జిల్లా-523101. (2). ... డి.నెం. 22-3-98/1, ... కందుకూరు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523101. [illegible]

తేది: 11-07-2023, ప్రదేశం: ఒంగోలు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్